


దిన పత్రిక
# తొలి సమయం
వాస్తవమే గమ్యం.. గమనం...

సంపుటి : 01 సంచిక : 295 మంగళవారం 22-10-2024 ఎడిటర్ : వేముల అయోధ్య రాములు పేజీలు : 4 వెల : 5 రూ/..

# దేశ భద్రత, ప్రజల రక్షణలో
# పోలీసుల పాత్ర ఎనలేనిది

- ప్రజలు ప్రశాంతంగా ఉంటున్నారంటే పోలీసులే కారణం
- రాష్ట్ర అభివృద్ధిలోనూ పోలీసులదే కీలక బాధ్యత
- శాంతిభద్రతలతోనే రాష్ట్రానికి పెట్టుబడి అవకాశాలు
- అమరులైన పోలీస్ కుటుంబాలను ఆదుకుంటాం
- మరణించిన పోలీస్ కుటుంబాలకు 2కోట్ల వరకు సాయం
- అమరపోలీసులకు నివాళి అర్పించిన సిఎం రేవంత్ రెడ్డి



**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి హైదరాబాద్**

శాంతి భద్రతలు, నిఘా విషయంలో తెలంగాణ పోలీసుల పాత్ర కీలకమని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశ భద్రత, ప్రజల రక్షణలో పోలీసుల పాత్ర ఎనలేనిదన్నారు. అమరులైన వారి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. విధి నిర్వహణలో మరణించిన అధికారులను గుర్తు చేసుకోవడం అందరికీ స్ఫూర్తిదాయకమని చెప్పారు. అమరులైన కానిస్టేబుల్, ఏఎస్సై కుటుంబాలకు రూ.కోటి పరిహారం ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్‌లోని గోషామహల్ స్టేడియంలో నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో అసువులుబాసి అమరులైన పోలీసులకు సీఎం నివాళులర్పించారు. అనంతరం ముఖ్యమంత్రి రేవంత్ ప్రసంగిస్తూ.. అమరులైన పోలీస్ అధికారులందరికీ ప్రభుత్వం తరపున ఘన నివాళులర్పించారు. 140 కోట్ల దేశ జనాభా ప్రశాంతంగా ఉంటున్నారంటే అందుకు పోలీసులే కారణమన్నారు. రాష్ట్రం అభివృద్ధి పదంవైపు నడవాలంటే పోలీసులు కీలకమన్నారు. నిరుద్యోగుల సమస్య, శాంతి భద్రత లేని రాష్ట్రం ఉంటే పెట్టుబడులు రావని.. రాష్ట్రం అభివృద్ధికి పోలీసులు నిరంతరం శ్రమిస్తున్నందుకు అభినందనలు తెలియజేశారు. అమరులైన పోలీస్ అధికారుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని స్పష్టం చేశారు. అమరులైన ఎస్సై, సీఐ కుటుంబాలకు రూ.కోటి 25 లక్షలు.. డీఎస్పీ, ఏఎస్పీ కుటుంబాలకు రూ.కోటి 50 లక్షలు.. ఎస్పీ, ఐపీఎస్ కుటుంబాలకు రూ.2 కోట్ల పరిహారం ఇస్తామన్నారు. శాశ్వత అంగవైకల్యం పొందిన పోలీసులకు పరిహారం ఇస్తామని ప్రకటించారు.'పోలీసు సిబ్బంది పట్ల నాకు ప్రత్యేక అభిమానం ఉంది. పోలీసులు, వారి కుటుంబాలు ఆత్మగౌరవంతో జీవించాలి. ఎవరి ముందో చేయి చాచే పరిస్థితి తెచ్చుకోవద్దని కోరుతున్నానని అన్నారు. విమర్శలకు అవకాశం ఇవ్వొద్దని కోరుతున్నా. విధి నిర్వహణలో పోలీసులకు ఎలాంటి లోటు లేకుండా చర్యలు తీసుకుంటాం. వారి ఖర్చులు, ఇతర ఏర్పాట్లకు నిధులు కేటాయిస్తాం. నేరగాళ్లు సరికొత్త విధానాలతో ముందుకొస్తున్నారు. పెరుగుతున్న ఆధునిక సాంకేతికత ద్వారా నేరాలు చేస్తున్నారని హెచ్చరించారు. తెలంగాణ పోలీసుల విధానాలను ఇతర రాష్ట్రాలు పాటిస్తున్నాయి. మన ఫోరెన్సిక్ ల్యాబ్ అనేక రాష్ట్రలకు ఆదర్శంగా నిలుస్తోంది. మన సైబర్ క్రైమ్ విభాగం దేశంలోనే గొప్పదని కేంద్ర హోంశాఖ అభినందించింది. ఇవాళ డ్రగ్స్ మహమ్మారి యువతను పట్టిపీడిస్తోంది. డ్రగ్స్ వల్ల పంజాబ్ అనేక కష్టాలు ఎదుర్కొంటోంది. మాదకద్రవ్యాల వినియోగం రాష్ట్రంలో క్రమంగా పెరుగుతోంది. వీటి నివారణకు రాష్ట్రంలో టీజీన్యాబ్‌ను ఏర్పాటు చేశాం. ఏఐ పరిజ్ఞానంతో ట్రాఫిక్ నియమాలు ఉల్లంఘించేవారిని గుర్తిస్తున్నాం. నేరస్థులను కఠినంగా శిక్షించేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉంది. శాంతిభద్రతలను చేతుల్లోకి తీసుకోవద్దని ప్రజలను కోరుతున్నాం. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుపుకోవడంలో పోలీసుల సేవలు మరచిపోలేము. జీతం కోసం వారు పనిచేయడం లేదని అన్నారు. బాధ్యతాయుతంగా భావించి సేవలు అందిస్తున్నారు' అని రేవంత్‌రెడ్డి తెలిపారు. తీవ్రవాదులు, మావోయిస్టు చేతుల్లో మరణించిన అధికారులను స్మరించుకోవడం అందరికి స్ఫూర్తిదాయకమన్నారు. సైబర్ నేరాలు విపరీతంగా పెరిగిపోతున్నాయని.. డ్రగ్స్ మహమ్మారి యువతపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు.దేశానికే తెలంగాణ రాష్ట్రం ఆదర్శంగా ఉండే విధంగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో ట్రాఫిక్ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తున్నామన్నారు. మందిరాల మీద, మజీద్‌ల మీద దాడులు చేసే వారిపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఇటీవల ముత్యాలమ్మ గుడిపై దాడి చేసిన వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. శాంతి భద్రతలు తమ చేతిల్లోకి తీసుకునే వారి పట్ల కఠినంగా ఉండాలని తెలిపారు. వివిధ పండుగలు ప్రశాంతంగా జరుకోవడంలో పోలీస్ సేవలు మరచిపోలేమని కొనియాడారు. జీతం కోసం పోలీస్ సిబ్బంది పనిచేయడం లేదని.. బాధ్యతాయుతంగా భావించి పోలీసులు సేవలు అందిస్తున్నారన్నారు. క్రిమినల్స్‌తో పోలీసులు ఫ్రెండ్లీగా ఉండడం కాదని.. బాధితులతో ఫ్రెండ్లీగా ఉండాలని సూచించారు. క్రిమినల్స్ విషయంలో పోలీసులు కఠినంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. పోలీస్ కుటుంబాల కోసం యంగ్ ఇండియా స్కూల్‌ను ఈరోజు ప్రారంభిస్తున్నామన్నారు. 50 ఎకరాల విస్తీర్ణంలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ఏర్పాటు చేస్తున్నామని.. ఈరోజు పునాది వేస్తున్నామన్నారు.

## ఆర్థిక ఇబ్బందుల్లో సమర్థ పనితీరు

- ప్రపంచానికి ఆశాకిరణంగా భారత్
- 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో మోడీ



**న్యూఢిల్లీ,అక్టోబర్21:** ప్రపంచం మొత్తం కొవిడ్, యుద్దాలు, ఆర్థిక సంక్షోభాలతో ఇబ్బంది పడుతున్న వేళ కూడా మన దేశంలో 'భారత్ శతాబ్ది' గురించి ఆలోచిస్తున్నారని ప్రధాని మోదీ అన్నారు. ఆయన 'ది ఎన్డీటీవీ వరల్డ్ సమ్మిట్'లో ప్రారంభోపన్యాసం చేశారు. ప్రపంచానికి భారత్ ఆశాకిరణంలా కనిపిస్తోందన్నారు. దేశం ప్రతి రంగంలో శరవేగంగా అభివృద్ధి చెందుతోందని అభివర్ణించారు. 'మా ప్రభుత్వం ఇప్పటికే 125 రోజులు పూర్తి చేసుకొంది. ఈ కాలంలో మా ప్రభుత్వ అనుభవాన్ని మీతో పంచుకుంటాను. పేదలకు 3 కోట్ల కొత్త పక్కా గృహాలు ఇచ్చాం. రూ.9 లక్షల కోట్ల ఇన్ఫా ప్రాజెక్టులపై పని మొదలైంది. 15 వందేభారత్ రైళ్లు ప్రారంభించాం. 8 కొత్త ఎయిర్ పోర్టుల పనికి శ్రీకారం చుట్టాం. యువతకు రూ.2లక్షల కోట్ల రూపాయల ప్యాకేజీ ఇచ్చాం. రైతుల ఖాతాల్లో రూ.21 వేల కోట్లను బదిలీ చేశాం. 70 ఏళ్లు దాటిన వృద్ధులకు ఉచిత వైద్యానికి ఏర్పాట్లు చేశాం. 5 లక్షల ఇళ్లలో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలు ఏర్పాటు చేశాం. స్టాక్‌మార్కెట్ సూచీల్లో దాదాపు 7 శాతం వృద్ధి నమోదైంది. విదేశీ మారకద్రవ్యం 700 బిలియన్ డాలర్లను దాటేసింది. నేను కేవలం 125 రోజుల్లో జరిగిందే చెబుతున్నాను. ఈ కాలంలో భారత్‌లో ప్రపంచం మూడు విషయాలు చర్చించడానికి వచ్చింది. టెలికామ్-డిజిటల్ ఫ్యూచర్‌పై అంతర్జాతీయ అసెంబ్లీ జరిగింది. గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్టివల్ నిర్వహించారు. గ్లోబల్ సెమీకండక్టర్ ఎకోసిస్టమ్‌పై సదస్సు జరిగింది. ఇవి భారత్ దిశ.. ప్రపంచం ఆశను తెలియజేస్తున్నాయి. ప్రపంచ భవిష్యత్తును భారత్ నిర్ణయిస్తుంది. మా ప్రభుత్వ మూడో విడత పాలనతో రేటింగ్ ఏజెన్సీలు దేశ వృద్ధిరేటును గణనీయంగా పెంచాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. భారత్ వేగంగా వృద్ధి చెందుతున్న దేశమని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేదల కష్టాలు తమకు బాగా తెలుసన్నారు. ఈ కార్యక్రమానికి ముందు ఆయన సదస్సులో పాల్గొనడానికి వచ్చిన విదేశీ అతిథులను కలుసుకొన్నారు. రెండ్రోజుల పాటు జరగనున్న ఈ సదస్సులో యూకే మాజీ ప్రధాని డేవిడ్ కామరూన్, భూటాన్ ప్రధాని దాసో త్సేరింగ్ టోబ్గే, విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్, భారతీ ఎయిర్‌టెల్ ఛైర్మన్ సునీల్ మిత్తల్ తదితరులు పాల్గొననున్నారు.

## గడ్చిరోలి జిల్లాలో ఎన్‌కౌంటర్

### నలుగురు నక్సల్స్ హతం

**నాగపూర్,అక్టోబర్21:** మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో సోమవారంనాడు ఎన్‌కౌంటర్ చోటుసుకుంది. పోలీసులకు, నక్సలైట్లకు మధ్య జరిగిన కాల్పుల్లో నలుగు నక్సలైట్లు హతమయ్యారు. ఒక పోలీసు గాయపడ్డాడు. భమ్రాగఢ్ తహసిల్‌లోని కొప్రి అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగినట్టు అధికారులు తెలిపారు. గడ్చిరోలి పోలీస్ సీ60 కమెండో టీమ్, సీఆర్‌పీఎఫ్ బృందం సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపట్టాయి. కొప్రి అడవుల్లో నక్సలైట్లు సంచరిస్తున్నట్టు పోలీసులకు ఇంటెలిజెన్స్ సమాచారం రావడంతో సుమారు 60 మంది పోలీసు బలగాలు ఈ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తీసుకున్నాయి. ఈ క్రమంలోనే ఎదురుకాల్పులు చోటుచేసుకున్నాయి. కాగా, గడ్చిరోలి జిల్లాలో నక్సలైట్ల జంట లొంగిపోయినట్టు అధికారులు తెలిపారు. వీరిపై రూ.8 లక్షల రివార్డు కూడా ఉంది. లొంగిపోయిన నక్సలైట్లను ఆసిన్ రాజారామ్ కుమార్ (37) అలియాస్ అనిల్, అతని భర్య అంజు (28) అలియాస్ సోనియాగా గుర్తించారు. అనిల్ ఒడిశాలో మావోయిస్ట్ ప్రెస్ టీమ్ ఏరియా కమిటీ సభ్యుడిగా ఉన్నాడు. హర్యానాకు చెందిన ఆయన నకిలీ ఐడెంటిటీతో హిమాచల్ ప్రదేశ్‌లోని సిమ్లా సమీపంలో ఉంటున్నాడు. ఇదే ప్రెస్ టీమ్ సభ్యురాలిగా ఉన్న జలే కూడా హిమాచల్‌లోనే ఉంటోంది. వీరిద్దరూ సీఆర్‌పీఎఫ్ అధికారుల సమక్షంలో గడ్చిరోలి పోలీసులకు లొంగిపోయారు.

## కెనడా తీరుపై మంత్రి జైశంకర్ అసహనం



**న్యూఢిల్లీ,అక్టోబర్21:** భారత దౌత్యవేత్తలపై కెనడా ప్రభుత్వ చర్యలతో ఇరుదేశాల మధ్య దౌత్య సంబంధాలు క్షీణించిన క్రమంలో..తాజా పరిణామాలపై భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ స్పందించారు. పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరిందని.. అందుకే మన హైకమిషనర్‌తో పాటు దౌత్యవేత్తలను వెనక్కి పిలిపించామని చెప్పారు. ఓ జాతీయ వార్తా ఛానెల్ నిర్వహించిన సదస్సులో పాల్గొన్న ఆయన.. ఆ దేశంతో సంబంధాలను ప్రస్తుతం అంచనా వేయడం కష్టమేనన్నారు. 'పోలీసు విచారణలో భారత హైకమిషనర్ పాల్గొనాలని కెనడా కోరింది. అందుకే మన హైకమిషనర్‌తోపాటు దౌత్యవేత్తలను ఉపసంహరించుకోవడాన్ని ఎంచుకున్నాం. దౌత్యవేత్తల సంక్షేమం, భద్రతకు సంబంధించి కెనడాలో ఏం జరుగుతుందనే విషయాలను తెలుసుకోవడం కెనడాకు ఇబ్బంది కరంగా మారినట్లు కనిపిస్తోంది.

## గ్రూప్-1 పరీక్షల్లో జోక్యం చేసుకోలేం

### మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చేందుకు సుప్రీం నిరాకరణ

### యథాతథంగా గ్రూప్ పరీక్షల నిర్వహణ

**న్యూఢిల్లీ,అక్టోబర్21:** తెలంగాణ గ్రూప్-1 అభ్యర్థుల పిటిషన్‌పై జోక్యం చేసుకునేందుకు, మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టు తన మధ్యంతర ఉత్తర్వుల్లో అన్ని అంశాలూ స్పష్టంగా చెప్పిందని సీజేఐ నేతృత్వంలోని ధర్మాసనం తెలిపింది. అభ్యర్థులు పరీక్షా కేంద్రాల్లో ఉన్నప్పుడు జోక్యం చేసుకోవడం సరికాదని పేర్కొంది. ఫలితాల విడుదలకు ముందే తుది విచారణ ముగించాలని హైకోర్టుకు సూచించింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 29 రద్దు చేయాలని కోరుతూ గ్రూప్-1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తీర్పు వచ్చే వరకు పరీక్షలు వాయిదా వేయాలని కోరారు. జీవో 55నే అమలు చేయాలని కోరినా సీఎం పట్టించుకోవడం లేదని పిటిషన్‌లో పేర్కొన్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీవో 55కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 8న జారీ చేసిన జీవో 29ని రద్దు చేయాలని గ్రూప్-1 అభ్యర్థులు కోరుతున్నారు. జనరల్ కేటగిరీలోని అభ్యర్థుల కంటే ఎక్కువ మార్కులు సాధించిన వారిని అన్‌రిజర్వుడుగానే పరిగణిస్తుండటం వల్ల దివ్యాంగ అభ్యర్థులకు అన్యాయం జరుగుతోందన్నారు. వారికంటే ఎక్కువ మార్కులు వచ్చినా.. రిజర్వేషన్ కేటగిరీగానే పరిగణించి 1:50 కింద అభ్యర్థులను మెయిన్స్‌కు పిలవాలని కోరుతున్నారు. దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించిన వివాదం నేపథ్యంలో గ్రూప్-1 పరీక్షలు నిలిపివేయాలని కొందరు అభ్యర్థులు కోరగా.. హైకోర్టు నిరాకరించింది. నోటిఫికేషన్ రద్దు చేయాలన్న అభ్యర్థనను తిరస్కరించిన ఉన్నత న్యాయస్థానం.. నియామకాలు తుది తీర్పునకు లోబడి ఉంటాయని విచారణ వాయిదా వేసింది.

## రైతుబంధు ఎగిరిపోయింది

- రాబందుల రెక్కల చప్పుడు మిగిలింది - ఎక్స్ వేదికగా కెటిఆర్ విమర్శలు



**తొలి సమయం, ప్రధాన ప్రతినిధి హైదరాబాద్**

అసెంబ్లీ ఎన్నికల సమయంలో బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ చేసిన నినాదం గుర్తుందా అంటూ ఎక్స్ వేదికగా బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతుబంధు రాదని తామన్నామని, ఇప్పుడు అదే అక్షర సత్యం అయిందని విమర్శించారు. ఎకరానికి రూ.15 వేలు ఇస్తామన్నవారు, రూ.10 వేలకే ఎగనామం పెట్టారని పేర్కొన్నారు. 'రైతుబంధు కావాలా..? రాబందు కావాలా..? ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ఇచ్చిన నినాదం గుర్తుందా..? రైతుబంధు ఎగిరిపోయింది..రాబందుల రెక్కల చప్పుడే మిగిలింది! నమ్మి నానబోస్తే పుచ్చి బుర్రలైనట్టుంది పరిస్థితి..! ఎకరానికి రూ.15వేలు ఇస్తామని ఊదరగొట్టి..ఉన్న పదివేలు ఊడగొట్టారు..! పంట పెట్టుబడి ఎగ్గొట్టడం అంటే..అన్నదాత వెన్ను విరవడమే..! రైతు ద్రోహి కాంగ్రెస్..చరిత్ర నిండా అనేక రుజువులు..ఇప్పుడు ఇంకొకటి ! రైతు ద్రోహి సీఎం రేవంత్ రెడ్డిని వదిలేదే లేదు' అని కేటీఆర్ తన ఎక్స్ పోస్ట్ లో విమర్శలు గుప్పించారు. రైతు భరోసా నిబంధనలంటూ కమిటీలు వేస్తూ కాలయాపన చేస్తున్నారని బీఆర్‌ఎస్ విమర్శించింది. ఆదివారం వివిధ జిల్లా కేంద్రాలు, మండల కేంద్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బీఆర్‌ఎస్ శ్రేణులు నిరసనలు తెలిపాయి. ఈ మేరకు ఆ పార్టీ ఇవాళ ఎక్స్ లో చేసిన ఓ పోస్ట్ ను కేటీఆర్ రీపోస్ట్ చేశారు. 'రైతులకు మద్దతుగా జిల్లా, మండల కేంద్రాల్లో ఎమ్మెల్యేలు, పార్టీ శ్రేణులు రాస్తారోకోలు, ధర్నాలు చేశారు. రైతులకు ద్రోహం చేసిన రేవంత్, ప్రభుత్వ దిష్టిబొమ్మలను దహనం చేసి.. వ్యతిరేక నినాదాలతో హోరెత్తించారు. రేవంత్ సర్కారు హామీలను అమలు చేయకుండా అన్నదాతలను నయవంచనకు గురిచేసింది. ఇప్పటికే రుణమాఫీ విషయంలో కర్షకులను వంచించిన కాంగ్రెస్ సర్కారు ఇప్పుడు రైతు భరోసా విషయంలోనూ మరోసారి మోసం చేసింది. అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన రేవంత్‌రెడ్డి మోసాలు మరోసారి బయటపడ్డాయి. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఎకరానికి రూ.15 వేల చొప్పున రైతు భరోసా ఇవ్వాల్సిందే. గడచిన వానకాలం రైతుభరోసా ఇవ్వబోమంటే ఊరుకోం. సబ్ కమిటీ నివేదిక వచ్చాకే యాసంగి సాయం అందిస్తామంటే సహించబోం' అని బీఆర్‌ఎస్ అధికారిక ఎక్స్ అకౌంట్లో పోస్ట్ చేసింది.

## బ్రెజిల్ అధ్యక్షుడికి తలకు గాయం

### బ్రిక్స్ సదస్సుకు దూరం

**న్యూఢిల్లీ,అక్టోబర్21:** బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తలకు గాయం కావడంతో బ్రిక్స్ సదస్సు కు వర్చువల్‌గా హాజరుకానున్నారు. శనివారం రాత్రి బాత్రూంలో జారిపడటంతో ఆయన తలకు గాయం అయ్యిందని అధికారులు తెలిపారు. వైద్యుల సూచన మేరకు రష్యాలో జరగనున్న బ్రిక్స్ సదస్సు కార్యక్రమానికి ఆయన నేరుగా హాజరు కాలేకపోతున్నారని.. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరవుతారని బ్రెజిల్ అధికారిక కార్యాలయం ప్రకటన విడుదల చేసింది.మాస్కో అధ్యక్షతన రష్యాలోని కజన్ వేదికగా ఈ నెల 22 నుంచి 24 వరకు 16వ బ్రిక్స్(బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికా) శిఖరాగ్ర సదస్సు జరగనుంది. ఈ సందర్భంగా బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో భారత ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు నిర్వహిస్తారు. మోదీ రష్యా పర్యటన చేపట్టడం ఈ ఏడాదిలో ఇది రెండో సారి.

# మంత్రి కొండా సురేఖకు ఘన సన్మానం

## పుష్పగుచ్ఛం అందించి..శాలువాతో ఘనంగా సన్మానిస్తున్న వేముల మహేందర్ గౌడ్



**తొలి సమయం జయశంకర్ భూపాలపల్లి అక్టోబర్ 21:** కాటమయ్య రక్షణ కవచ కిట్ల పంపిణీ కార్యక్రమం బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సోమవారం వరంగల్ ఏనుమాముల మార్కెట్ యార్డు ప్రాంగణంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినటువంటి రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖమ్మను బీసీ సంక్షేమ సంఘం జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు వేముల మహేందర్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి..శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మహేందర్ గౌడ్ గౌడ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రి సురేఖమ్మ దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి సురేఖమ్మ సానుకూలంగా స్పందించి గౌడ కులస్తుల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని మంత్రి సురేఖమ్మ హామీనిచ్చారని మహేందర్ గౌడ్ తెలిపారు. అనంతరం ఈనెల 23న మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీ జన్మదినాన్ని పురస్కరించుకొని అభిమానులు ఏర్పాటుచేసిన మెగా రక్తదాన శిబిరం వాల్ పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జై గౌడ ఉద్యమ సంఘం జిల్లా నాయకుడు చర్లపల్లి శ్రీధర్ గౌడ్, కొండా దంపతుల అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫారెస్ట్ భూముల్లో మట్టి దొంగలు


**సమాచారం ఇవ్వడానికి అధికారుల శసబిషలు**

**తాళ్ల పూసపెల్లి, అన్నారం శివారు ఫారెస్ట్ భూముల్లో ఆగని మట్టి దొంగలు**

**ఫారెస్ట్ భూముపై అస్పష్టమైన వివరణతో అధికారుల పై పలు అనుమానాలు**







**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్20:** తాళ్ల పూస పల్లి మరియు అన్నారం శివారు ఫారెస్ట్ భూముల్లో మట్టి దొంగలు అడ్డు అదుపు లేకుండా రెచ్చిపోతున్నారని,దిక్కు దివానా లేని జేసీబీ, ట్రాక్టర్లకు డ్రైవర్లుగా, ఓనర్లుగా ఓ సామాజిక వర్గానికి చెందిన పేదోళ్లను చూపెడుతున్నారు. దీని వెనుక రాజకీయ నాయకుల అండదండలు మెండుగా ఉండడం వలన, ఈ దందా నడుస్తోంది అనే విమర్శలు ఉన్నాయి,ఫారెస్ట్ భూములపై కన్నేసిన రియల్ మాఫియా. మైనింగ్ మాఫియా, మట్టి మాఫియా గత పదేళ్లలో ఫారెస్ట్ భూములను రైతుల పేరుట ఫేక్ రిజిస్ట్రేషన్ లను చేపించడం వెనుక ఉన్న మతులబే అక్రమ రియల్,మైనింగ్, మట్టి దొంగలు అనే టాక్ నడుస్తోంది. ఈ మూడు అక్రమ రంగాలు అధికారులను మానిప్లై చెయ్యడం వల్లనే.. ఫారెస్ట్ భూముల హననం యదేచ్చగా కొనసాగుతోందని విమర్శలు ఉన్నాయి.. తాళ్ల పూస పెల్లి అన్నారం శివారు ఫారెస్ట్ భూముల్లో భారీగా అక్రమ తతంగం కొనసాగినట్లు పట్టణ ప్రజల్లో, పర్యావరణ ప్రేమికుల్లో, సామాజిక కర్తల్లో గుసగుసలు వినపడుతున్నాయి.. ఫారెస్ట్ మరియు రెవెన్యూ, అధికారుల అస్పష్టమైన వివరణలు ఇవ్వడంతో అధికారులపై పలు అనుమానాలకు తావిస్తోంది..

**ఎఫ్ఆర్ఓ జ్యోత్స్నా**

**మహబూబాబాద్**

మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని ఎక్కడ ఏ సర్వే నంబర్ లో ఎంత భూమి ఉన్నది? అనే ప్రశ్నకు సమాధానంగా.. ఇప్పటివరకు రెవెన్యూ కు ఆరుసార్లు దరఖాస్తు పెట్టుకున్నాము, సర్వే నెంబర్లు ఇవ్వలేదు, మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రెవెన్యూ మరియు ఫారెస్ట్ ఉమ్మడి భూమి లేదు మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని రిజర్వు అడవి జమాండ్ల పెల్లి మరియు ఈదుల పూస పెల్లి సెక్షన్స్ లో కంపార్ట్మెంట్స్ నెంబర్స్ తో కలిసి ఉన్నది. రెవెన్యూ సర్వే నెంబర్స్ తో కలపబడిన భూమి లేదు, ఒకవేళ ఉన్నా..భూమి ఫారెస్ట్ కంపార్ట్మెంట్ నెంబర్స్ తో కలిసి ఉన్నది. కనీసం హద్దులు ఏమైనా ఉన్నాయా అనే ప్రశ్నకు సమాధానంగా.. హద్దులు ఎవరో పీకేశారు.. పీకేసిన వారిపై ఏమైనా చర్యలు తీసుకున్నారా!అనే ప్రశ్నకు సమాధానం కూడా లేక పోవచ్చును అనేది అడ్వాన్స్ గా తెలిసి పోతోంది.

**వాల్టా చట్టం మార్గదర్శకాలు**

గాలికి వదిలేయడం వల్లనే మట్టి దొంగలకు పట్టు పగ్గాలు లేకుండా పోయాయని పర్యావరణ సామాజిక కార్యకర్తల అభిప్రాయాలు కొనసాగుతున్నాయి..

**కలెక్టర్ వెంటనే స్పందించాలి**

మహబూబాబాద్ రెవెన్యూ మరియు మున్సిపాలిటీ పరిధిలోని.. ఈదుల పూస పెల్లి, మరియు అన్నారం శివారు ఫారెస్ట్ భూముల సర్వే నెంబర్లను. భూమి వివరాల స్పష్టమైన సమాచారము ఇచ్చే విధంగా.. రెవెన్యూ మరియు ఫారెస్ట్ శాఖ కార్యాలయాల్లో పక్కా సమాచారము ఉండే విధంగా చొరవ తీసుకోవాలి, ఇప్పటివరకు ఫారెస్టు భూముల్లో ఫేక్ బావులు తవ్వి మట్టిని అమ్ముకున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి.. ఫారెస్ట్ భూములకు పక్కా హద్దులు ఏర్పాటుచేసి, మట్టి మైనింగ్ దందాకు చెక్కు పెట్టి ఫారెస్ట్ భూములను కాపాడాలని.. జిల్లా పర్యావరణ ప్రేమికులు సామాజిక కర్తలు, పట్టణ ప్రజలు కోరుకుంటున్నారు.

# మానుకోటలో ఘనంగా 81 వ రాష్ట్రీయ హిందూ ఫౌజ్ దివస్






**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 21:**
21 అక్టోబర్ 2024న నేతాజీ సేవాసమితి మానుకోట ఆధ్వర్యంలో 81 వ రాష్ట్రీయ ఆజాద్ హింద్ ఫౌజ్ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అతిధిగా ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ మాలోత్ రవీందర్ చౌకిదార్ ఆర్ హాజరు అయ్యారు జెండా ఆవిష్కరణ చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1947 స్వాతంత్రం రాకముందే సింగపూర్ లో 1943లో నేతాజీ భారత స్వాతంత్ర సమితిని స్థాపించి భారతదేశానికి స్వాతంత్రాన్ని ప్రకటించారన్నారు. మొట్టమొదటి ప్రధానమంత్రి రక్షణ మంత్రి, విదేశాంగ మంత్రి మన నేతాజీ తెలియజేసారు.నేతాజీ సేవాసమితి అధ్యక్షులు డాక్టర్ కందుల నాగరాజ్ మాట్లాడుతూ మన మానుకోట పట్టణంలో మొట్టమొదటిసారిగా ఆజాద్ హింద్ ఫౌజ్ జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో సంతోషాన్ని ఇస్తుందని అన్నారు నేతాజీ సేవాసమితి ఆధ్వర్యంలో 24 వ కార్యక్రమం అని , నేతాజీ విగ్రహం 75 సంవత్సరాల చరిత్ర గల విగ్రహం అని మరి అటువంటి విగ్రహానికి చుట్టుపక్కల చెత్తాచెదారాలు మరియు దండ వేయడానికి కనీస మెట్లు లేవని,లిఆవిష్కరించడానికి గద్దె కూడా లేదని, దయచేసి ప్రభుత్వం చొరవ తీసుకొని ఏర్పాటు చేయగలరని ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో నేతాజీ సేవా సమితి ఉపాధ్యక్షులు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి కుదురుపాక వివేక్, కోశాధికారి మైసరోహిత్, ఉప కార్యదర్శి గంగాధర్, కన్వీనర్ లక్ష్మీనారాయణ, కో కన్వీనర్ వోబ్బిలి శెట్టి రామకృష్ణ, శోభన్ బాబు, జంగాల వెంకటేష్, సోమ శ్రీనివాస్ , చిట్టి మల్ల రఘు, విశ్రాంత సైనికులు సత్యనారాయణ మరియు నరసింహారావు పాల్గొన్నారు.

# అక్టోబర్ 27న మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్

**- 10వ తరగతి విద్యార్థులకు 150 కోట్ల స్కాలర్షిప్స్, 2 కోట్ల ప్రైజ్ మనీ**

**- వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్, మోషన్ ఐఐటీ, నీట్ ఇన్స్టిట్యూట్ చైర్మన్**




**తొలి సమయం, హనుమకొండ అక్టోబర్ 21:**
హన్మకొండ నయీమ్ నగర్ మోషన్ ఐఐటీ నీట్ ఇన్స్టిట్యూట్ లో సోమవారం అక్టోబర్ 27న నిర్వహించబోయే మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ గురించి ప్రెస్ మీట్ నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మోషన్ ఐఐటీ నీట్ ఇన్స్టిట్యూట్ చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ అక్టోబర్ 27 న హన్మకొండ, నయీమ్ నగర్ లోని మోషన్ ఐఐటీ, నీట్ ఇన్స్టిట్యూట్ నందు ఈ విద్యా సంవత్సరం 10వ తరగతి చదువుతున్న విద్యార్థుల కోసం మోషన్ టాలెంట్ సెర్చ్ ఎగ్జామ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఎగ్జామ్ మోషన్ ఐఐటీ నీట్ ఇన్స్టిట్యూట్ హెడ్ సెంటర్ కోటా రాజస్థాన్ వారు నిర్వహిస్తున్నారని ఈ ఎగ్జామ్స్ లో దేశ వ్యాప్తంగా ప్రతిభ కనపరచిన వారికోసం రూ. 150 కోట్లు స్కాలర్షిప్స్ మరియు రూ.2 కోట్ల ప్రైజ్ మనీ, 500 మంది విద్యార్థులకు ఉచిత విద్యను అందివ్వనున్నట్లు తెలిపారు. అలాగే మోషన్ వరంగల్ సెంటర్ నుండి ఐదుగురు విద్యార్థులకు పూర్తి ఉచిత విద్య, ఐదుగురు విద్యార్థులకు 50 శాతం ఫీజులో రాయితీ తో మొత్తం రూ. 18 లక్షలు స్కాలర్షిప్తో పాటు మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి ల్యాప్ టాప్ రెండవ ర్యాంక్ సాధించిన విద్యార్థికి ట్యాబ్లేట్ దాదాపు రూ.1 లక్ష రూపాయల విలువగల ప్రైజ్ మనీ ఇవ్వనున్నట్లు వేణుగోపాల్ గౌడ్ తెలిపారు. ఈ టాలెంట్ టెస్ట్ ఎగ్జామ్ ఈ ఆదివారం ఉదయం 11 గంటల నుండి 12 గంటల వరకు ఉంటుందని,10వ తరగతిలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ, మాథ్స్, బయో సైన్స్ మెంటల్ ఎబిలిటీ సెలబస్ మీద 31 క్వశ్చన్స్ తో 124 మార్కులతో ఈ ఎగ్జామ్స్ ఉంటుందన్నారు. ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులుఈ సదవకాశాన్ని వినియోగించు కోవాలనా న్నరు. మిగతా వివరాల కోసం హన్మకొండ, నయీమ్ నగర్ లోని మోషన్ ఐఐటీ, నీట్ ఇన్స్టిట్యూట్ లో గాని లేదా ఈ క్రింద సెల్ నెంబర్ లకు గాని 9703000850/51/52 ఫోన్ చేసి ఫ్రీ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో మోషన్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ పెరుమాండ్ల అనిల్ గౌడ్, మోషన్ బ్రాంచ్ హెడ్ ముత్యాల సురేష్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ బి. మురళి, మార్కెటింగ్ మేనేజర్ శనిగరపు సుమన్, మార్కెటింగ్ టీం సభ్యులు తాళ్లపల్లి రమేష్ గౌడ్, పాక నాగరాజు, రచ్చ కుమార్, రవీందర్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గణిత ఉపాధ్యాయుడు కాసం శ్రీనివాసరావుకి టీచర్ ఎక్సలెన్సీ అవార్డు






**తొలి సమయం మహబూబాబాద్ అక్టోబర్ 21:**
అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా శారద ఎడ్యుకేషనల్ సొసైటీ మరియు స్కై లైఫ్ ఫౌండేషన్ వారిచే కంబాలపల్లి హైస్కూల్లో పనిచేస్తున్న కాసం శ్రీనివాస రావు స్కూల్ అసిస్టెంట్ గణిత ఉపాధ్యాయుడుకి టీచర్ ఎక్సలెన్సీ అవార్డు ఇచ్చి సన్మానం చేసారు.
ఈకార్యక్రమంనికి ముఖ్య అతిథులుగా పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీ కేతావత్ సోమ్లాల్ డా,, మైనష్ జిందాల్,డా,, జ్యోత్స్నా రావు, సినీ దర్శకుడు శ్రీ రవి చరణ్, డిఎంఆర్ఎల్ సైంటిస్టు తన్నీరు నిరంజన్, శారద ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ వ్యవస్థాపకులు పట్నం కమల మనోహర్ మరియు స్కై లైఫ్ ఫౌండేషన్ చైర్మన్ పసుపులేటి నరేంద్ర స్వామి గార్లు చేతుల మీదుగా ఆదివారం రోజున బిర్లా భాస్కర ప్లానిటోరియం ఆడిటోరియం, హైదరాబాద్ నందు జ్ఞాపిక, శాలువా మరియు సన్మానపత్రంతో సన్మానం చేశారు.

## సియోల్‌లో మంత్రుల బృందం పర్యటన

**చెత్త తరలింపు..విద్యుత్ ఉత్పత్తిపై పరిశీలన**

**అతిపెద్ద మాసో ప్లాంట్ పనీతీరుపై అధ్యయనం**

**తొలి సమయం హైదరాబాద్,** దక్షిణ కొరియా రాజధాని సియోల్‌లో చెత్త నుంచి విద్యుదుత్పత్తి చేసే మాపో రిసోర్స్ రికవరీ ప్లాంట్‌ను మంత్రుల బృందం సందర్శించింది. అలాగే అక్కడ చెత్త సేకరణ, మురికి నీటి నిర్వహణ తదితర పద్ధతులను కూడా పరిశీలించింది. సియోల్‌లో తెలంగాణ మంత్రులు, అధికారుల బృందం పర్యటిస్తోంది. మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎం సలహాదారు వేం నరేందర్‌రెడ్డి, ఎంపీ చామల కిరణ్‌కుమార్ రెడ్డి, హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, పలువురు ఎమ్మెల్యేలు, పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిషోర్, జీహెచ్‌ఎంసీ, మూసీ రివర్‌ఫ్రంట్ అధికారులు ఈ బృందంలో ఉన్నారు. మాపో ప్లాంట్‌లో రోజుకు వెయ్యి టన్నుల వ్యర్థాలను రీసైక్లింగ్ చేసి విద్యుదుత్పత్తి చేస్తున్నారు. వ్యర్థాల రీసైక్లింగ్‌కు వేస్ట్ టు ఎనర్జీ టెక్నాలజీని సియోల్ నగరపాలక సంస్థ వాడుతోంది. పర్యావరణంపై దుష్ప్రభావం పడకుండా ఆధునిక సాంకేతికతను వినియోగిస్తోంది. మరో 10 ఏళ్లలో పూర్తిగా భూ ఉపరితలం నుంచి తొలగించి భూగర్భంలో అతిపెద్ద ప్లాంట్‌ను నిర్మించేందుకు సియోల్ నగర పాలక సంస్థ ప్రయత్నాలు చేస్తోంది. ఈ నేపథ్యంలో మాపో ప్లాంట్ పనితీరును అధ్యయనం చేసేందుకు తెలంగాణ మంత్రుల బృందం వెళ్లింది. ఈ సందర్భంగా దానకిషోర్ మాట్లాడుతూ సియోల్, హైదరాబాద్ నగర నమూనాలు ఒకేలా ఉంటాయని తెలిపారు. సియోల్‌లో సుమారు 10వేల మెట్రిక్ టన్నుల చెత్తను సేకరించి నగరంలోని నాలుగు వైపులకు తరలిస్తున్నారని చెప్పారు. హైదరాబాద్‌లో దాదాపు 8వేల మెట్రిక్ టన్నులు సేకరించి ఒకే వైపునకు తీసుకెళ్తున్నామని తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నగరం చుట్టూ నాలుగు ప్రదేశాలను గుర్తించినట్లు వివరించారు. నగరంలోని చెత్తను నాలుగు వైపులకు పంపించడం ద్వారా రవాణా ఖర్చులు తగ్గుతాయన్నారు. హైదరాబాద్ నగరం, తెలంగాణ ప్రజల భావితరాల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మూసీ నదిని ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినట్లు ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. సియోల్‌లో చెయోంగ్ గయ్ చియోన్ నదిని ఆయన పరిశీలించారు.

## దళిత యువకుడు, వాలంటీర్ దుర్గాప్రసాద్ హత్య కేసు

**పోలీసుల అదుపులో మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్?**

**రాజమహేంద్రవరం,అక్టోబర్21:** దళిత యువకుడు, వాలంటీర్ జనుపల్లి దుర్గాప్రసాద్ హత్య కేసులో వైకాపా నేత, మాజీ మంత్రి పినిపె విశ్వరూప్ కుమారుడు శ్రీకాంత్‌ను ఏపీ పోలీసులు అరెస్ట్ చేసినట్లు తెలుస్తోంది. తమిళనాడులోని మధురైలో అతడిని అదుపులోకి తీసుకుని అక్కడి న్యాయమూర్తి ముందు హాజరుపరిచినట్లు సమాచారం. ట్రాన్సిట్ వారెంట్‌పై ఏపీకి తీసుకొచ్చేందుకు పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల ద్వారా తెలిసింది. శ్రీకాంత్ అరెస్ట్‌ను రాష్ట్ర పోలీసు అధికారులు నిర్ధరించాల్సి ఉంది. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లిలో రెండేళ్ల క్రితం జరిగిన దళిత యువకుడి హత్య కేసులో పినిపె శ్రీకాంత్‌ను పోలీసులు ప్రధాన నిందితుడిగా గుర్తించినట్లు సమాచారం. కోనసీమ అల్లర్ల సమయంలో అయినవిల్లికి చెందిన వాలంటీరు దుర్గాప్రసాద్‌ను 2022 జూన్ 6న హత్య చేయించినట్లు నిర్ధరణకు వచ్చారు. ఈ కేసుకు సంబంధించి ఉప్పలగుప్తం మండలానికి చెందిన నిందితుడు, వైకాపా సోషల్ మీడియా కన్వీనర్, మృతుడికి స్నేహితుడైన వడ్డి ధర్మేశ్‌ను పోలీసులు విచారించారు. అతడిని ఈ నెల 18న అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసులో మరో నలుగురు నిందితులతోపాటు పినిపె శ్రీకాంత్ కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలోనే మదురైలో శ్రీకాంత్‌ను అరెస్ట్ చేసినట్లు సమాచారం. ఈ నెల 18న ధర్మేశ్‌ను విచారించి, వివరాలు సేకరించినట్లు తెలిసింది. అతడు.. మృతుడు దుర్గాప్రసాద్, శ్రీకాంత్‌లకు సన్నిహితంగా ఉంటూ, పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా ఉండేవారని పోలీసులు నిర్ధరణకు వచ్చారు. దుర్గాప్రసాద్‌ను హత్య చేయించేందుకు నిర్ణయించిన శ్రీకాంత్.. ధర్మేశ్ సహాయం కోరి, మరో నలుగురికి ఆ బాధ్యత అప్పగించినట్లు విచారణలో గుర్తించినట్లు తెలుస్తోంది. హత్యకు స్థానికంగా ఓ ప్రముఖ లాడ్జిలో పథక రచన చేసినట్లు సమాచారం. దుర్గాప్రసాద్‌ను ధర్మేశ్ కోటిపల్లి రేవు వద్దకు ద్విచక్ర వాహనంపై తీసుకెళ్లగా, వెనుక కారులో నలుగురు అనుసరించారు. రేవు వద్ద ఓ వ్యక్తి పడవలో లోపలకు తీసుకెళ్లగా, కారులో వచ్చిన వారిలో ముగ్గురు దుర్గాప్రసాద్ మెడకు తాడు బిగించి, హత్య చేశారని నిందితుడు ధర్మేశ్ చెప్పినట్లు సమాచారం. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు అప్పట్లో పోలీసులు తొలుత మిస్సింగ్ కేసుగా నమోదు చేశారు. కొన్నాళ్లకు మృతదేహం లభించడం, పోస్టుమార్టంలో హత్య చేసినట్లు నిర్ధరణ అయింది.

## నంద్యాల పిటిషన్ కొట్టేయండి

**ఎపి హైకోర్టులో అల్లు అర్జున్ పిటిషన్**

**అమరావతి,అక్టోబర్21:** ఏపీ హైకోర్టులో సినీనటుడు అల్లు అర్జున్ పిటిషన్ దాఖలు చేశారు. ఎన్నికల సమయంలో నంద్యాలలో తనపై నమోదైన కేసును క్వాష్ చేయాలని ఆయన కోరారు. సెక్షన్ 144, పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉండగా అనుమతి లేకుండా జనసమీకరణ చేపట్టారంటూ అల్లు అర్జున్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను హైకోర్టు విచారణకు స్వీకరించింది. ఎన్నికల సమయంలో నంద్యాలలో పర్యటించిన అల్లు అర్జున్ పై ఈసీ ఆదేశాల మేరకు కేసు నమోదు అయింది. ఆ కేసును కొట్టి వేయాలంటూ అల్లు అర్జున్ ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాను ఎన్నికల ప్రచారం కోసం వెళ్లలేదని తన స్నేహితుడ్ని కలవడానికి మాత్రమే వెళ్లానని ఆయన అంటున్నారు.

# పోలీసు అమరవీరుల ప్రాణ త్యాగాలు చిరస్మరణీయం

## -వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా





**తొలి సమయం వరంగల్, అక్టోబర్ 21**

శాంతి భద్రతల పరిరక్షణకై ప్రాణత్యాగాలు చేసిన పోలీస్ అమరవీరులు ప్రజల గుండెల్లో చిరస్మరణీయం నిలిచిపోతారని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయములోఅమరవీరుల స్థూపం వద్ద పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని (ఫ్లాగ్ డే)ను ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గత ఏడాది నుండి ఇప్పటి వరకు దేశంలో విధినిర్వహణలో మరణించిన 241మంది పోలీస్ అమరవీరుల పేర్లను అదనపు డీసీపీ రవి చదివి వినిపించారు. అనంతరం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గోన్న వరంగల్ పోలీస్ కమిషనర్ తో పాటు వరంగల్, హనుమకొండ జిల్లాల కలెక్టర్లు డా.సత్య శారద , ప్రావీణ్య, కర్నల్ రవికుమార్ రవి,డిసిపిలు షేక్ ,సలీమా రవీందర్ తో పాటు అదనపు ఏ.సి.పిలు, ఏ.సి.పిలు, ఇన్స్ స్పెక్టర్లు, ఆర్. ఐలు పోలీస్ . అమరవీరుల కుటుంబ సభ్యులు, ఇతర పోలీస్ సిబ్బంది పోలీస్ అమరవీరుల స్థూపం వద్ద పుష్పాగుచ్చాలు వుంచి నివాళులు అర్పించిన పిదప, ఆర్.ఐ స్పర్జన్ సారథ్యంలో సాయుధ పోలీసులు 'శోక్ శ్రస్త్ చేసి మరణించిన పోలీసు అమరవీరులకు పోలీసు అధికారులు, సిబ్బంది, అమరవీరుల కుటుంబ సభ్యులు రెండు నిమిషాలు మౌనం పాటించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ ప్రజల సేవకోసం తమ ప్రాణాలను ఆర్పించిన పోలీసులు మహనుభావులని, పోలీసు అమరవీరుల చూపిన మార్గదర్శకాన్ని అనుసరిస్తూ, ప్రజల శ్రేయస్సు కోరకు పాటుపడాలని, ప్రజల్లో మంచి పేరు రావాలంటే చిత్తశుద్ధి, నిజాయితీతో పనిచేయాల్సి వుంటుందని పోలీసు అమరవీరుల త్యాగాలను మరువలేమని, వారు ఎల్లప్పుడు మన గుండెల్లోనే వుంటారని, వారు మన మధ్య లేనకున్నా మనం వారిని స్మరిస్తునే వుంటామని, అసువులు బాసిన అమరవీరుల కుటుంబాలను కాపాడుకోవల్సిన భాధ్యత మనందరిపై వుందని, వారికి ఎలాంటి సమస్య వున్న వారికి పోలీస్ విభాగం తరుపున పూర్తి సహకారం అందజేయడం జరుగుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. అనంతరం పోలీస్ కమిషనరేట్ కార్యాలయము నుండి మిషన్ హస్పటల్ వరకు నిర్వహించిన ర్యాలీలో పోలీసులు అధికారులు, సిబ్బంది పోలీసు అమరవీరుల కుటుంబ సభ్యులతో పాటు పోలీసు జాగృతి కళాబృందం సభ్యులు పాల్గోని పోలీసు అమరవీరులకు జోహర్లు అర్పించారు






# చర్ల సిహెచ్‌సి శవపరీక్ష కేంద్రాన్ని తక్షణమే తెరవాలి

## శవపరీక్ష చేసే మేల్ నర్సింగ్ సిబ్బందిని నియమించాలి

**తొలి సమయం చర్ల, అక్టోబర్ 21**

సిపిఐ ఎంఎల్ ప్రజాపంద పార్టీ ఆధ్వర్యంలో చర్ల ప్రభుత్వ ఆసుపత్రి పరిధిలో నిర్మించిన శవపరీక్ష కేంద్రాన్ని తక్షణమే ఓపెనింగ్ చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా పార్టీ డివిజన్ నాయకుడు కొండాచరణ్ మాట్లాడుతూ ఎన్నో ప్రజా పోరాటాల ఫలితంగా చర్ల మండలానికి శవపరీక్ష కేంద్రంన్నీ ప్రభుత్వం నిర్మించిందని అన్నారు. స్పందించి శవపరీక్ష కేంద్రాన్ని నిర్మించినందుకు అధికారులకు ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు కానీ శవ పరీక్ష కేంద్రం నిర్మించి ఆరు నెలలు అవుతున్నప్పటికీ కూడా ఇప్పటివరకు ఓపెనింగ్ చేయకపోవడం అనేది సరైన పద్ధతి కాదు అని వాపోయారు ప్రభుత్వం వైద్యాధికారులు చర్ల మండలంలోని ప్రజలు శవ పరీక్ష కేంద్రం నిర్వహణలో లేకపోవడం వల్ల పడుతున్న ఇబ్బందులను క్షేత్రస్థాయిలో అర్థం చేసుకోవాలని అన్నారు.

మరణించిన మృతదేహానికి శవపరీక్ష చేయవలసి వచ్చినప్పుడు చనిపోయిన వ్యక్తి యొక్క మృతదేహాన్ని వాహనంలో వేసుకొని 50 కిలోమీటర్ల దూరంలో ఉన్న భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లి ఒక రోజు మొత్తం అక్కడ ఉంచి పోస్టుమార్టం చేయించి మరణించిన మరుసటి రోజు ఇంటికి తీసుకువచ్చి దహన మరియు ఇతర కార్యక్రమాలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది ఇది బంధువులకు అత్యంత వేదన కలిగించేటువంటి విషయం అని అంతే కాకుండా చర్ల మండలం




పోలీస్ యంత్రాంగానికి కుడా ఎంతో సమస్యగా ఉంటు0దనీ అన్నారు.

కాబట్టి ఈ పరిస్థితిని వైద్య ఉన్నత అధికారులు అర్థం చేసుకోవాలి తక్షణమే వారం రోజుల్లో ఈ శవ పరీక్ష కేంద్రాన్ని ఓపెనింగ్ చేయాలని డిమాండ్ చేశారు లేనియెడల ప్రజానీకాన్ని ఐక్యం చేసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో పార్టీ చర్ల మండల కార్యదర్శి కొండ కౌశిక్ పార్టీ మండల నాయకులు చెన్నం మోహన్ , నరసింహ, పార్టీ నాయకులు రేగా ఆంధ్రయ ,జములు, గౌర్ల నాగమణి, పురటి సుశీల, గూడపాటి నరసింహారావు తదితరులు పాల్గొన్నారు

# రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన సీపీ





**తొలి సమయం హన్మకొండ, అక్టోబర్ 21**

పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ పోలీసుల ఆధ్వర్యంలో స్థానిక భీమారంలోని శుభం కళ్యాణ వేదిక లో ఎంజియం రక్తనిది సహకారంతో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ప్రారంభించారు. హనుమకొండ, కాజీపేట్, కేయుసి పోలీస్ స్టేషన్ పరిధిలోని యువకులు, పోలీస్ అధికారులు ఉత్సాహం ఈ రక్తదాన పాల్గోని స్వచ్చందంగా రక్తదానం చేశారు.

అనంతరం రక్తదానము చేసిన వారికి పోలీస్ కమిషనర్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు, పండ్లు, హెల్టీ డ్రింక్స్ అందజేశారు.

ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ షేక్ సలీమా,ఏసీపీ దేవేందర్ రెడ్డి, ఇన్స్ స్పెక్టర్లు రవికుమార్, సత్యనారాయణ రెడ్డి, సతీష్, యం. జి. యం రక్తనిది ఇంచార్జ్ ఆశతో పాటు ఎస్. ఐ లు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కెసిఆర్ అప్పులకు నెలకు 6వేల కోట్ల వడ్డీ

## నిజామాబాద్ పర్యటనలో మంత్రి జూపల్లి వ్యాఖ్య

**తొలి సమయం, నిజామాబాద్,అక్టోబర్21:** మాజీ సీఎం, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు తెలంగాణపై చేసిన అప్పులకు నెలకు రూ. 6వేల కోట్లు వడ్డీ చెల్లిస్తున్నామని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. వడ్డీలు ఎంత భారం అయినప్పటికీ తమ ప్రభుత్వం ఇచ్చిన హామిలను అమలు చేస్తూ వస్తుందని స్పష్టం చేశారు. నూడ ఛైర్మన్ కేశ వేణు ప్రమాణ స్వీకార కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో మంత్రి జూపల్లి కృష్ణారావు, టిపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ,ప్రభుత్వ సలహా దారులు షబ్బీర్ అలీ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ...గ్రూప్-1 పరీక్షల విషయంలో బీఆర్ఎస్ నేతలు విద్యార్థులను రెచ్చగొట్టే ప్రయత్నం చేశారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రతిష్టను మసకబార్చే ప్రయత్నం చేశారని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు అభినందనీయమని అన్నారు. కాంగ్రెస్ పార్టీ బడుగు బలహీన వర్గాల పార్టీ అని చెప్పారు. నిజామాబాద్ జిల్లాపై సీఎం రేవంత్ రెడ్డికి ప్రత్యేక మక్కువ ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు తెలిపారు. 'జిల్లాకు అత్యధికంగా కేటాయించిన నామినేటెడ్ పోస్టులే ఇందుకు నిదర్శనం. రాష్ట్ర ప్రభుత్వంపై కొన్ని మీడియా సంస్థలు , సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఈ విష ప్రచారాన్ని కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుకోవాలి. గడిచిన పదేళ్లలో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అధ్వానంగా మార్చింది. కేసీఆర్ హయాంలో ఏ ఒక్క హామీ అమలు కాలేదు. కేసీఆర్ ఒక నియంతలా రాష్ట్రాన్ని పరిపాలించాడు కాబట్టే ప్రజలు సరైన బుద్ధి చెప్పారు.

## సంక్షేమ పథకాల ఎంపిక

# పారదర్శకముగా జరగాలి

- అర్హులైన అందరికి ప్రభుత్వ పధకాలు అందాలి

- శివకుమార్ తడికల బిఎస్పీ జిల్లా ఇన్చార్జ్

**తొలి సమయం, చర్ల, అక్టోబర్ 21**



తలంగాణా రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాల అర్హుల ఎంపిక కొరకు గ్రామ పంచాయితీ స్థాయిలో ఎంపిక కమిటీలను ఏర్పాటు చేయ తలపెట్టడం ప్రయోజనము శూన్యమని బహుజన్ సమాజ్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇన్ చార్జ్ తడికల శివకుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఆద్వర్యంలోని తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడం పూర్తిగా విఫల మయ్యిందని, మ్యానిఫెస్టో అమలు చేయక పోగా కాలయాపన చేస్తూ సంక్షేమ పధకాల ఎంపిక కమిటీల పేరిట కొత్త డ్రామా మొదలు పెట్టిందని అన్నారు.ఇందిరమ్మ ఇండ్ల ఎంపిక కొరకు గ్రామ పంచాయితీల పరిధిలో కొందరిని ఎంపిక చేయడానికి తీసుకున్న నిర్ణయం ఫలితాలు ఇవ్వక పోగా గ్రామ స్థాయిలో గంధరగోళానికి,గొడవలకు కారణం అవుతుందని దుయ్యబ ట్టారు. అధికార పార్టీ కార్యకర్తలను ,నాయకులను కమిటీలలో తీసుకునే అవకా శం ఎక్కువగా ఊంటుంది కనుక సంక్షేమ పథకాల ఎంపిక పారదర్శకంగా ఉండదని,దాని మూలంగా అనేక గొడవలు తలెత్తుతాయని తక్షణమే ఈ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని అన్నారు. సమగ్ర సర్వే ద్వారా ,వివిద సర్వేల ద్వారా రెవిన్యూ,పంచాయితీ అధికారుల దగ్గర ఇదివరకే అర్హుల సమాచారం ఉందని దాన్ని బట్టి అర్హుల ఎంపిక అధికారుల ద్వారా చేస్తే సరిపోతుందని రాజకీయ నాయకుల ప్రమేయం అవసరం లేదని అన్నారు. ఒక వేళ ప్రభుత్వం పథకం అమలులో జాప్యం చేసినా ,పథకం చేరక పోయినా పథకాల ఎంపిక అర్హత లభించని వారినుండి కమిటీల్లో ఉండేవారు విమర్శలు,దాడులు ఎదుర్కోవలసి న ప్రమాదం కూడా ఉంటుందని అన్నారు.కాబట్టి ప్రభుత్వం ఈ విషయంలో పునరాలోచించాలని అన్నారు. ఎంపికలో పారదర్శకత ఉండేలా అధికారులను ఆదేశించాలని ప్రభుత్వాన్ని కోరారు.

# షార్ట్ ఫిలిం పోస్టర్ ఆవిష్కరించిన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ నరేందర్




**తొలి సమయం,చర్ల, అక్టోబర్ 21**

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నల్లగొండ నరేందర్, ప్రముఖ కళాకారుడు చెన్నుమల్ల చిన్న (లక్ష్మీనారాయణ) చేతుల సందేశాత్మక లఘు చిత్రం పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ లఘు చిత్రం విజయం సాదించాలి అని అభినందనలు తెలియజేశారు.ఈ లఘు చిత్రానికి దర్శకత్వం వహించిన తంగెపల్లి శంకరా చారి మాట్లాడుతూ సమాజంలో జరుగుతున్న క్షణికావేశ ఆత్మ హత్యల గురించి వివరిస్తూ ఆధ్యాత్మిక భావంతో చక్కటి కథ కధాంశంతో ఆత్మహత్యలను దేవుడే మనిషి రూపంలో వచ్చి ఎలా అరికట్టాడు అనే వివరణాత్మకంగా చూపించడం జరిగింది అని ఆయన అన్నారు. ఈ చిత్రంలో ప్రముఖ నటులు ఆడెపు ముత్యలరావు,కె. వీరభద్రం, జి.లక్ష్మణ్ కుమార్ చర్ల (ఏంఏ,బిఈడి, ఎల్ఎల్బి), గుమ్మల వేణు, అశోక్, సాయి అద్భుతమైన నటనను ప్రదర్శించారు అని దర్శకులు వివరించారు. మరి కొన్ని రోజుల్లో యూట్యూబ్ ఛానెల్ (టిసిఎస్‌యు ట్యూబ్ చానెల్)లో విడుదల అయ్యే ఈ లఘు చిత్రం గొప్ప విజయం సాధిస్తుంది దర్శకులు ఆశాభావం వ్యక్తం చేశారు.

# గద్దర్ స్మారక ఫైనల్ క్వాలిఫైడ్ మ్యాచ్‌లో విజయం సాధించిన కరీంనగర్ కళాకారుల క్రికెట్ టీం



**తొలి సమయం, కరీంనగర్, అక్టోబర్ 21**

స్థానిక మానకొండూరు మండలం పోలీస్ గ్రౌండ్ మానకొండూరులో కీ.శే గద్దర్ అన్న స్మారక జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్ మానకొండూర్ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. సోమవారం ఫైనల్ క్వాలిఫైడ్ మ్యాచ్ మానకొండూర్ జట్టు / కళాకారుల జట్టు మధ్యలో ఉత్కంఠ పోటీ జరిగింది. మొదటిగా టాస్ గెలిచిన మానకొండూరు జట్టు ఫీల్డింగు ఎంచుకున్నారు. కరీంనగర్ కళాకారులు జట్టు బ్యాటింగ్ బరిలోకి దిగి 10 ఓవర్లలో 8 వికెట్లు నష్టపోయి 66 పరుగులు చేశారు సుద్దాల హరీష్, పెరుమాండ్ల ప్రసాద్ ఇద్దరి భాగస్వామ్యంతో పరుగుల వర్షం కురిపించారు. మానకొండూరు జట్టుకు 67 పరుగుల టార్గెట్ ను ఇచ్చారు. మానకొండూరు జట్టు బ్యాటింగ్ బరిలోకి దిగి 9:2 ఓవర్లలో 9 వికెట్లు నష్టపోయి52 పరుగులు చేయగలిగి వెనుతిరిగారు. సుద్దాల హరీష్ కు 4వికెట్లు, మహేందర్ కు 2 వికెట్లు కె.శ్రీనివాస్ కు 2వికెట్లు ఆఖరి 6బంతులలో మిలీనియం శ్రీనివాస్ వికెట్ కీపర్ 2 వికెట్లు స్టంప్స్ చేసి జట్టు విజయాన్ని అందించారు. కరీంనగర్ కళాకారుల క్రికెట్ టీం: మిలీనియం శ్రీనివాస్ , ఆకేనా భాస్కర్ మిమిక్రీ మహేష్, రెయిన్ స్టార్ కృష్ణ ,పెరుమాండ్ల ప్రసాద్ , సుద్దాల హరీష్ గౌడ్, కొత్తపల్లి రంజిత్, పొలాస శేఖర్, మహేందర్, శ్రీనివాస్, షాబీర్, కార్తీక్, మిరియాల గోపి , వైరస్ శ్రీనివాస్, నరేష్ త్వరలో జరగబోయే ఫైనల్ మ్యాచ్ విజయం కావాలని కరీంనగర్ ఆర్టిస్టు ఆర్గనైజర్స్ క్రికెట్ లీగ్ ఆర్గనైజర్ మిమిక్రీ మహేష్ కేపిఎల్ కళాకారుల ప్రీమియర్ లీగ్ ఆర్గనైజర్ ఈగల్ సతీష్ మాట్లాడుతూ జట్టు విజయానికి వికెట్ కీపర్ మిలీనియం శ్రీనివాస్, ఆకేనా భాస్కర్ కరీంనగర్ కళాకారుల టీం సభ్యులందరినీ సమిష్టి విజయం అని అభినందించారు.

# గ్రూప్ -1 పరీక్షలకు బందోబస్తు

## విపక్ష బిఆర్ఎస్ నేతల గృహనిర్బంధం

**తొలి సమయం, హైదరాబాద్,అక్టోబర్21:** గ్రూప్ 1 పరీక్షలు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ప్రారంభం కానున్న నేపథ్యంలో విపక్ష బీఆర్ఎస్ నేతలను పోలీసులు హౌజ్ అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసం వద్ద పోలీసులు పహారాకాసారు.బంజారాహిల్స్ నందినగర్‌లోని కేటీఆర్ ఇంటి వద్ద పోలీసులు భారీగా మోహరించారు. వందల సంఖ్యలో పోలీసులను మోహరించి, పదుల పోలీసు వాహనాలను ఉంచారు. నందినగర్ ప్రాంతమంతా పోలీసు బలగాలతో నిండిపోయింది.గ్రూప్-1 మెయిన్స్ వాయిదా వేయాలని కోరుతున్న అభ్యర్థుల తరఫున విపక్షాలు నిరసనలు చేస్తున్న విషయం తెలిసిందే. కాసేపట్లో పరీక్ష ప్రారంభం కాబోతున్నందనా.. రాజకీయ నిరసనలు జరగి, పరీక్షలకు ఇబ్బందులు కలగకుండా పోలీసులు ముందస్తు చర్యలు తీసుకున్నారు.

# రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

## సుందరగిరిలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

**తొలి సమయం, చిగురుమామిడి, అక్టోబర్ 21**

ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే వరి పంటను విక్రయించి మద్దతు ధర పొందాలని తహసిల్దార్ ముద్దసాని రమేష్,సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి తెలిపారు.సోమవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని చైర్మన్ రమణారెడ్డి తహసిల్దార్ రమేష్,ఎంపీడీవో కాజా మొయినుద్దీన్ ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

కొనుగోలు సెంటర్ కు నాణ్యమైన వడ్లను తీసుకొచ్చి ప్రభుత్వ మద్దతు ధరను పొందాలన్నారు. ఏ గ్రేడ్ వరిధాన్యం ధర 2320,సాధారణ వడ్లకు 2300,సన్న వడ్లకు 500రూపాయల బోనస్ ప్రభుత్వం అందిస్తుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నిర్వాకులకు సూచించారు. చిగురుమామిడి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పరిధిలో గల గ్రామాల్లో



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినట్లు చైర్మన్ చెప్పారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి రమ్యశ్రీ,సింగిల్ విండో వైస్ చైర్మన్ కరివేద మహేందర్ రెడ్డి,ఏపీఎం మట్టేల సంపత్,సంఘం డైరెక్టర్లు అందే స్వామి,తాళ్లపల్లి తిరుపతి,చిట్టుమల్ల శ్రీనివాస్, చాడ శ్రీధర్ రెడ్డి,కూతురు రవీందర్ రెడ్డి,ముద్రకొల రాజయ్య, పేరాల లక్ష్మి,మాచమల్ల లక్ష్మి,బండి లక్ష్మి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కంది తిరుపతి రెడ్డి, మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రామోజీ కృష్ణమాచారి, గందె సంపత్ వివిధ క్లస్టర్ల ఏఈవోలు పంచాయతీ కార్యదర్శులు రైతు సోదరులు వివిధ పార్టీ ప్రతినిధులు సంఘం సిబ్బంది పాల్గొన్నారు.

# దండకారణ్యంలో పోలీస్‌లకు నక్సలైట్లకు మధ్య కాల్పులు

## -కాల్పుల్లో నలుగురు నక్సలైట్లకు మృతి





**తొలి సమయం, చర్ల, అక్టోబర్ 21**

తెలంగాణ సరిహద్దు రాష్ట్రమైన ఛత్తీస్గఢ్ ను ఆనుకుని ఉన్న మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లా సరిహద్దు ప్రాంతమైన భమ్రాగఢ్ తహసీల్‌లో భద్రతా బలగాలు, నక్సలైట్ల మధ్య ఎదురుకాల్పులు కొనసాగుతున్నాయి. ఇప్పటి వరకు అందిన సమాచారం ప్రకారం నలుగురు నక్సలైట్లు హతమైనట్లు సమాచారం. ఈ ఆపరేషన్‌లో భద్రతా బలగాల సిబ్బంది కూడా గాయపడినట్లు సమాచారం. గాయాలైన సిబ్బందిని ఆసుపత్రికి తరలించారు .ఎన్‌కౌంటర్ స్థలం వైపు యాంటీ నక్సల్ స్పెషల్ స్క్వాడ్ సి-60ని పంపినట్లు సోర్సెస్ చెబుతున్నాయి. ఎన్‌కౌంటర్‌లో నక్సలైట్లకు భారీ నష్టం వాటిల్లే అవకాశం ఉంది. వచ్చే నెలలో మహారాష్ట్రలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల దృష్ట్యా ఈ ఎన్‌కౌంటర్‌ను కీలకంగా భావిస్తున్నారు. ఇటీవల తెలంగాణ పోలీసులు ఒక మహిళా నక్సలైట్‌ను అరెస్టు చేశారు, ఆమె తలపై పోలీసులు కోటి రూపాయల రివార్డును ఉంచారు. నిందితురాలిని సుజాతగా గుర్తించారు. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మాలో జరిగిన అనేక ప్రధాన నక్సలైట్ ఘటనల్లో ఆమె ప్రమేయం ఉంది అని తెలియచేయటం జరిగింది .

# శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసుల కీలక పాత్ర

**- ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణగా నిలుస్తున్నారు - విధి నిర్వహణలో ఎంతోమంది ప్రాణాలు విడిచారు**

**- అమరావతితోల శాశ్వత స్మారక స్థూపం ఏర్పాటు- పోలీస్ అమరులకు నివాళి అర్పించిన సిఎం చంద్రబాబు**

**అమరావతి,అక్టోబర్21:** శాంతి భద్రతల పరిరక్షణకు ఏపీ పోలీసులు అహర్నిశలు కృషి చేస్తున్నారని, ప్రజల మాన, ప్రాణ, ఆస్తులకు రక్షణగా నిలుస్తున్నారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. రాష్ట్ర విభజన అనంతరం ఏపీ పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చినట్లు ఆయన చెప్పారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా సోమవారం విజయవాడలో అమరవీరుల స్థూపానికి సీఎం చంద్రబాబు ఘన నివాళులు అర్పించారు. ముందుగా ముఖ్యమంత్రితోపాటు హోంమంత్రి వంగలపూడి అనిత, ఏపీ డీజీపీ ద్వారక తిరుమలరావు పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. విధి నిర్వహణలో చాలా మంది పోలీసులు ప్రాణాలు విడిచి ప్రజల హృదయాల్లో త్యాగధనులుగా నిలిచారని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. అన్నింటికంటే పోలీసు శాఖ అత్యంత కీలకమని చెప్పారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. 'ఏ ప్రగతి జరగాలన్నా పోలీసులే కీలకం. ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడేందుకు రాత్రింబవళ్లు కష్టపడుతున్నారు. అహర్నిశలు శ్రమిస్తున్న పోలీసులను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా. ఉమ్మడి రాష్ట్రంలో నక్సలిజాన్ని ఉక్కుపాదంతో అణచివేశారు. ఫ్యాక్షనిజం, రౌడీల ఆట కట్టించారు. శాంతిభద్రతలను కాపాడటంలో ఏమాత్రం రాజీలేదు. పోలీసుల సంక్షేమం మా ప్రభుత్వం బాధ్యత. పటిష్ఠ యంత్రాంగంగా తయారు చేయడం మా కర్తవ్యం. రాష్ట్ర విభజన తర్వాత పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చాం. వాహనాలతో పాటు పరికరాలు, సాంకేతిక సౌకర్యం కల్పించాం. ఏపీ పోలీసు అంటే దేశంలోనే మోడల్‌గా తీర్చిదిద్దాలని ముందుకెళ్లాం. 2014-2019 మధ్య రూ.600 కోట్లు ఖర్చు చేశాం. కొత్తగా వాహనాల కోసం రూ.150కోట్లు వెచ్చించాం. పోలీసు కార్యాలయాల మరమ్మతులు, నిర్వహణకు రూ.60కోట్లు ఖర్చుపెట్టాం. రూ.27కోట్లతో ఏపీఎఫ్ఎస్ఎల్ ఎక్విప్‌మెంట్ కొనుగోలు చేశాం. పోలీసు సంక్షేమానికి రూ.55 కోట్లు కేటాయించాం. సర్వే రాళ్లపై బొమ్మలకు తగలేసి.. సీసీ కెమెరాలకు రూ.700కోట్లు ఇవ్వలేకపోయారు..సవాళ్లను సమర్థంగా ఎదుర్కొనేందుకు దీటైన పోలీసు వ్యవస్థకు శ్రీకారం చుట్టాం. విశాఖపట్నంలో గ్రేహౌండ్స్ కోసం ప్రత్యేక కేంద్రం ఏర్పాటు చేశాం. కేంద్రం ఎప్పటికప్పుడు పోలీసు వ్యవస్థ ప్రక్షాళనకు ముందుకొస్తోంది. ఆధునిక ఆయుధాలు, సాంకేతిక పరిజ్ఞానం అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అధికారంలోకి వచ్చిన 125 రోజుల్లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ చెల్లించాం. దిశ పేరుతో వాహనాలకు రూ.16కోట్లు, కమ్యూనికేషన్ పరికరాల కోసం రూ.20కోట్లు పెండింగ్ పెడితే వాటినీ చెల్లించాం. తప్పు చేసిన వ్యక్తిని వెంటనే పట్టుకునే వ్యవస్థ అవసరం. గత ప్రభుత్వం కక్ష



సాధింపులే పనిగా పెట్టుకుంది. రాగద్వేషాలకు అతీతంగా పనిచేసేదే పోలీసు వ్యవస్థ. సర్వే రాళ్లపై బొమ్మ కోసం రూ.700 కోట్లు తగలేసిన వ్యక్తి జగన్. సీసీ కెమెరాల కోసం మాత్రం రూ.700 కోట్లు ఇవ్వలేకపోయారు. నేరాల తీరు మారుతోంది.. పోలీసు వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలి. రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడేవారిని కఠినంగా శిక్షించాలి' అని చంద్రబాబు సూచించారు. దేశ రక్షణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకు నివాళులు అర్పిస్తున్నా. శాంతిభద్రతల కోసం వారు అహర్నిశలు కృషి చేస్తున్నారు. సంఘ విద్రోహ శక్తులపై పోరాడిన ఉమేశ్ చంద్ర, వేదవ్యాస్ లాంటి పోలీసులు ఎందరో ప్రాణాలు కోల్పోయారు. అలాంటి కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుంది. వారి స్ఫూర్తి ప్రతి పోలీసులో ఉంది. దేశానికి, రాష్ట్రానికి ఈ శాఖ చాలా కీలకం. రాత్రి, పగలు తేడా లేకుండా పని చేస్తారు. పోలీసు ఉద్యోగం సవాళ్లతో కూడుకుంది. 24 గంటలూ పని చేసే ఏకైక శాఖ పోలీసు శాఖ. వారికి పండగలు ఉండవు, ఎప్పుడూ విధుల్లోనే ఉంటారు. తిరుమల బ్రహ్మోత్సవాలు, దుర్గమాత ఉత్సవాలు, విజయవాడ విపత్తులో పోలీసుల పాత్ర అభినందనీయం. భారతదేశంలోనే ఏపీ పోలీసు వ్యవస్థ ఒక బ్రాండ్ అయిపోయిందన్నారు. ఆడబిడ్డలపై అత్యాచారాలు చేస్తున్నారు. ప్రతి కేసును సవాల్‌గా తీసుకుంటాం.. ఛేదిస్తాం. ఆడబిడ్డలు ట్రాప్‌లో పడొద్దు. నేరస్థులకు చట్టపరమైన శిక్షపడేలా ప్రభుత్వం చర్య తీసుకుంటుంది.

పిల్లలను తల్లిదండ్రులు కంట్రోల్ చేయాలి. హిందూపూర్ గ్యాంగ్ రేప్, కడపలో యువతి హత్య కేసులో నేరస్థులకు కఠిన శిక్షలు పడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది . ఆడబిడ్డల రక్షణే ప్రభుత్వ లక్ష్యం. రానున్న రోజుల్లో కానిస్టేబుల్ నియామకాలు చేపడతాం. ప్రతి ఏటా రూ.20 కోట్లు పోలీసు శాఖకు అందిస్తాం. రానున్న రోజుల్లో అమరావతిలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినం జరుపుకుందాం. అమరావతిలో శాశ్వత అమరవీరుల సంస్మరణ స్థూపం ఏర్పాటు చేస్తానని అన్నారు. రాయలసీమ ఫ్యాక్షనిజం, విజయవాడ రౌడీయిజం అణచివేసిందే పోలీసులే. ఇకపై రాష్ట్రంలో జీరో క్రైమ్ నమోదు కావాలి. శాంతి, భద్రతలు మొదటి ప్రాధాన్యతగా పనిచేయాలి. ఎవరైనా నేరం చేయాలనే ఆలోచన వస్తేనే భయపడాలి. పోలీసు వ్యవస్థలో అనేక మార్పులు తీసుకువచ్చాం. వారికి కావాల్సిన సదుపాయాలు అన్నీ సమకూర్చాం. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. సవాళ్లను ఎదుర్కొనేందుకు సమర్థవంతమైన వ్యవస్థను ఏర్పాటు చేశాం. నేను మొదట్నుంచీ పోలీసు వ్యవస్థపై ప్రత్యేక దృష్టి పెట్టా. సాంకేతిక పరిజ్ఞానాన్ని పోలీసులకు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. నేరస్థులు లేటెస్ట్ టెక్నాలజీ వాడుతుంటే పోలీసులు పాత టెక్నాలజీ వాడుతున్నారు. ప్రభుత్వం పోలీస్ వ్యవస్థపై దృష్టి పెడుతోంది. ఇకపై టెక్నాలజీ పరిజ్ఞానం అందిస్తాం. ఆధునిక పరికరాలు సమకూరుస్తాం అన్నారు. నేటి సమాజంలో నేరాల తీరు మారుతోంది. నేరస్థుల కంటే పోలీసులు ఎక్కువ టెక్నాలజీ కలిగి ఉంటేనే వారిని కట్టడి చేయగలం. రాజకీయ నాయకుల ముసుగులో కొంతమంది నేరాలకు పాల్పడుతున్నారు. వారి రాజకీయ ముసుగు తీసి నేరాలు అరికట్టే బాధ్యత పోలీసులు తీసుకోవాలి. మీకు అండగా ప్రభుత్వం ఉంటుంది.

## తిరుమల లడ్డూలో కల్తీపై పవన్ వ్యాఖ్యలు

**హైదరాబాద్,అక్టోబర్21:** తిరుమల శ్రీవారి లడ్డూలో ఉపయోగించే కల్తీ నెయ్యి అంశం ఇంకా కాకరేపుతూనే ఉంది. పంది కొవ్వు ఉపయోగించారని తెలిసి శ్రీవారి భక్తులు ఆందోళనకు గురయ్యారు. తిరుపతి లడ్డూపై రాజకీయ నేతలు, పలువురు ప్రముఖులు కామెంట్స్ చేశారు. ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా స్పందించారు. గత పాలక మండలి కల్తీ నెయ్యి ఉపయోగించిందని ఆరోపించారు. పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలతో చాలా మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయి. ఇదే అంశంపై హైదరాబాద్‌కు చెందిన అడ్వకేట్ ఇమ్మనేని రామారావు సిటీ సివిల్ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.భక్తులకే కాదు.. అయోధ్యలో రామ్ లల్లా ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి కూడా తిరుపతి లడ్డూ పంపించారని పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. పవన్ చేసిన కామెంట్లతో హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయి. తిరుమల లడ్డూ తయారీ కోసం జంతువులు కొవ్వు కలిపారని అనడం దారుణం. ఆ ఆరోపణలకు సంబంధించి ఫొటోలు, వీడియోలను కోర్టు ముందు ఉంచాం. లడ్డూ గురించి పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యలను ప్రసారం చేసిన యూట్యూబ్ చానెళ్ల నుంచి ఆ కామెంట్లను తొలగించాలి అని' పిటిషనర్ సిటీ సివిల్ కోర్టులో వేసిన పిటిషన్‌లో పేర్కొన్నారు. తిరుమల లడ్డూకు సంబంధించి ఇమ్మనేని రామారావు వేసిన పిటిషన్‌ను ధర్మాసనం విచారణకు స్వీకరించింది. వచ్చే నెల 22వ తేదీన కోర్టుకు వ్యక్తిగతంగా హాజరు కావాలని సమన్లు జారీచేసింది.

## మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్

**శంకుస్థాపన చేసిన సిఎం రేవంత్ రెడ్డి**

**తొలి సమయం రంగారెడ్డి,అక్టోబర్21:** రంగారెడ్డి జిల్లా మంచిరేవులలో యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ భవనానికి సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలీసుల పిల్లలకు ఇక్కడ విద్య అందించనున్నారు. పోలీసులు, ఎక్సైజ్,ఎస్‌పీఎఫ్ ఉద్యోగుల పిల్లలు ఇక్కడ విద్యనభ్యసించనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి శ్రీధర్ బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్ తదితరులు పాల్గొన్నారు. పోలీసుల సంక్షేమం కోసం ఆలోచించింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ నేపథ్యంలోనే యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌కు శంకుస్థాపన చేశామన్నారు. 2014లో రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ గత ప్రభుత్వం పార్టీ కోసం పోలీసులను ఉపయోగించుకుంది తప్ప.. ప్రజా సంక్షేమం కోసం కాదని విమర్శించారు. ఒక్క రోజు కూడా సెలవు తీసుకోకుండా పని చేస్తున్న పోలీసులకు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో యువత శ్రేయస్సు కోసం మొదటిగా యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేసుకున్నామన్నారు.'విద్యార్థుల్లో కులమతాల భేదం ఉండకూడదని అన్ని నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా స్కూల్స్ ఏర్పాటు దిశగా ముందుకెళ్తున్నాం. పోలీసుల పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో ఎదిగేలా నాణ్యమైన విద్యను అందించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్ ఏర్పాటు చేస్తున్నాం. గత ప్రభుత్వం 10 ఏళ్లలో చేసిందేమీ లేదు. తెలంగాణ వచ్చాక గ్రూప్-1 మెయిన్స్ నిర్వహిస్తున్నాం. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు 10 నెలలుగా ఓ విజన్‌తో ముందుకెళ్తున్నాం' అని శ్రీధర్‌బాబు తెలిపారు.

## మూసీపై పూటకో మాట మాట్లాడుతున్న సీఎం రేవంత్

**మరోమారు విమర్శలు గుప్పించిన హరీశ్ రావు**

**తొలి సమయం హైదరాబాద్,అక్టోబర్21:** మూసీపై పూటకో మాట మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌంటర్ ఇచ్చారు. పలు సందర్భాల్లో.. పలు వేదికల్లో మూసీపై సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన మాటలను హరీశ్‌రావు గుర్తు చేశారు. మూసీ పరివాహక అభివృద్ధి కోసం ఐదేండ్లలో రూ. లక్షా 50 వేల కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేసినట్లు జులై 20వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సెప్టెంబర్ 6న సీఎం చేతుల మీదుగా విడుదల చేసిన 'తెలంగాణ గ్రోత్ స్టోరీ ద రోడ్ టు వన్ ట్రిలియన్ డాలర్ ఎకానమీ' విజన్ డాక్యుమెంట్‌లోనూ.. రూ. లక్షా 50వేల కోట్లు అంటే సుమారు 18 బిలియన్ల డాలర్లతో ఐదేండ్లలో మూసీ రివర్ ఫ్రంట్ రీడెవలప్‌మెంట్ కొరకు ఖర్చు చేస్తున్నట్లుగా పేర్కొన్నారని హరీశ్‌రావు గుర్తు చేశారు. మొన్న ప్రెస్ మీట్‌లో మాట్లాడుతూ రూ.లక్షా50 వేల కోట్లు ఎవరన్నారంటూ రేవంత్ ఆవేశంతో ఊగిపోయారు. పూటకో తీరుగా మాట్లాడుతున్న మిమ్మల్ని చూసి ఊసరవెల్లి కూడా సిగ్గు పడుతుంది. బిడ్డ పుట్టక ముందే కుల్ల కుట్టినట్లు డీపీఆర్ లేకుండా రూ. లక్షా 50వేల కోట్లు ఖర్చవుతాయని చెప్పడం కాంగ్రెస్ ప్రభుత్వానికే చెల్లుతుంది. మూసీ రిజువినేషన్ అండ్ రివర్ ఫ్రంట్ పేరుతో ప్రజాధనం లూటీ చేయాలనే మీ కుట్రలను బట్టబయలు చేస్తాం. మీ నిరంకుశ విధానాలను అడుగడుగునా ఎండగడతాం. తెలంగాణ ప్రజల తరుపున నిలదీస్తామని సీఎం రేవంత్ రెడ్డిని హరీశ్‌రావు హెచ్చరించారు.

## కారు,బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు మృతి

**తొలి సమయం, మహబూబాబాద్,అక్టోబర్21:** మహబూబాబాద్ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కారు, బైక్ ఢీ కొన్న ఘటనలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు.ఈ విషాదకర సంఘటన మహబూబాబాద్ మండలం జామాండ్లపల్లి శివారు ఫారెస్ట్ అర్బన్ పార్క్ వద్ద చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## దీక్ష విరమించిన పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్

**లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా తదితర అంశాలపై చర్చ**

**నేరుగా కలిసి సమస్యలు తెలుసుకున్న హోంశాఖ అధికారులు**

**న్యూఢిల్లీ,అక్టోబర్21:** పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ , ఆయన అనుచరులు నిరాహార దీక్షను విరమించారు. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా, ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్లపై కేంద్ర హోంమంత్రిత్వ శాఖ అధికారులు ఆయన్ను కలిసి తమ ప్రతిపాదనలు ఉంచారు. అనంతరం ఆయనకు నిమ్మరసం అందజేసి దీక్షను విరమింపజేశారు. డిసెంబర్ 3న లేహ్ ఎపెక్స్ బాడీ, కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (కేడీఏ) ప్రతినిధులతో చర్చలు జరిపేందుకు కేంద్ర హోంశాఖ అంగీకరించడంపై వాంగ్‌చుక్ హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'కేంద్ర హోంశాఖ అధికారులు, లద్దాఖ్ జాయింట్ సెక్రటరీ వచ్చి డిసెంబర్ 3న చర్చలకు సంబంధించిన లేఖ అందజేశారు. ఇదివరకు నిలిచిపోయిన చర్చలు డిసెంబర్ 3న కొనసాగుతాయి. మా ప్రధాన డిమాండ్ నెరవేరింది. ఇరువర్గాల నుంచి నిజాయతీగా, సానుకూలంగా చర్చలు జరుగుతాయని భావిస్తున్నాం'అని ఆశాభావం వ్యక్తం చేశారు. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరో షెడ్యూల్‌లో చేర్చాలన్న డిమాండ్‌తో లేహ్ ఎపెక్స్ బాడీ (ఎల్‌ఏబీ), కార్గిల్ డెమొక్రటిక్ అలయెన్స్ (కేడీఏ) నేతృత్వంలో గత నెల 1న లేహ్ నుంచి సోనమ్ వాంగ్‌చుక్ 'దిల్లీ చలో' పాదయాత్రను చేపట్టారు. దీంతో పోలీసులు దిల్లీ సరిహద్దుల్లోనే అడ్డుకొని వారిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం జంతర్ మంతర్‌వద్ద దీక్ష కోసం వారు అనుమతి కోరగా పోలీసులు నిరాకరించడంతో.. ప్రత్యామ్నాయం లేక చివరకు తాను బస చేసిన లద్దాఖ్ భవన్ వద్దే అక్టోబర్ 6న దాదాపు 18మందితో కలిసి నిరాహార దీక్షకు దిగారు. లద్దాఖ్‌ను రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల్‌లో చేరిస్తే స్థానిక జనాభా, వారి భూమి, సాంస్కృతిక గుర్తింపును రక్షించేందుకు చట్టాన్ని రూపొందించే అధికారాన్ని ఇస్తుంది.

## తెలంగాణ ఎమ్మెల్యేలంటే ఇంత అవమానమా?

**మా సిఫారసు లేఖలంటే టిటిడికి చిన్న చూపెందుకు**

**తిరుమల అధికారుల తీరుపై**

**జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు**

**తిరుమల,అక్టోబర్21** వెంకన్నదర్శనానికి తెలంగాణ ప్రజా ప్రతినిధుల సిఫార్స్ లేఖలు అనుమతించక పోవడంతో తిరుమల తిరుపతి దేవస్థానం అధికారుల వ్యవహారశైలిపై జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి తీవ్ర వ్యాఖ్యలు చేశారు. సోమవారం ఉదయం ఏడుకొండలవాడిని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి దర్శించుకున్నారు. అనంతరం తిరుమాడ వీధుల్లో ఆయన విలేకర్లతో మాట్లాడుతూ... తిరుమలలో స్వామి వారి దర్శనానికి తెలంగాణ ప్రజా ప్రతినిధుల జారీ చేసే సిఫార్స్ లేఖలు అనుమతించకపోవడం బాధాకరమన్నారు. డయిల్ యువర్ ఈవో కార్యక్రమంలో సైతం టీటీడీ ఈవో సైతం తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్స్ లేఖను అనుమతి ఇవ్వమని స్పష్టం చేశారని ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి గుర్తు చేశారు. అయితే తమ తెలంగాణ రాష్ట్రంలో ప్రముఖ పుణ్యక్షేత్రాలు యాదాద్రి, భద్రాచలంలో దేవుడు దర్శనానికి వచ్చే ఆంధ్ర ప్రజా ప్రతినిధుల సిఫార్స్ లేఖలను తమ ప్రభుత్వం అనుమతి ఇస్తుందని తెలిపారు. కానీ తమ తెలంగాణ విషయంలో ఎందుకు చిన్న చూపు చూస్తున్నారని టీటీడీ అధికారులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి ప్రశ్నించారు. తమ సొంత మనుషులు, పార్టీ కార్యకర్తలు తిరుమలలో శ్రీవారి దర్శనానికి వెళ్తాం.. రూమ్ ఇప్పించండి అంటే.. ఇప్పించలేని దుస్థితి నేడు నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉంటే తెలుగుదేశం పార్టీ వాళ్లు హైదరాబాద్‌లో ఆశ్రయం పొందుతారని పేర్కొన్నారు. అలాగే టీడీపీ ప్రభుత్వం కొలువు తీరితే.. వైసీపీ వాళ్లు హైదరాబాద్ వచ్చి ఉంటారన్నారు. ఏపీ వాళ్లు హైదరాబాద్‌లో బిజినెస్ చేసుకున్నా.. తెలంగాణ వాళ్లు ఏనాడు ఒక్క మాట కూడా వాళ్లని అనలేదన్నారు.

TEL TEL RNI NO 12283 VEMULA AYODHYA RAMULU TOLI PODDU PUBLICATIONS AND PRINTERS GRAPHICS
H-NO 1-6-155/43/45/4 NANDI NAGAR POST:MANDAL DIST: MAHABUBABAD TELANGANA STATE INDIA PIN CODE 506 101